SK1 one NEWS HD

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాషా | సంపుటి : 08 సంచిక : 186 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | శుక్రవారం 16-10-2026

అబ్దుల్ కలాం జయంతి.. వైఎస్ జగన్ నివాళి



- వైఎస్ జగన్‌కు అభిజిత్ దీప్కే ధన్యవాదాలు
- దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి. కలాం జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నివాళి అర్పించారు.
- దేశ రాష్ట్రపతి పదవిని అలంకరించిన ఆయన నిరాడంబర జీవితం అందరికీ ఆదర్శం అని ప్రశంసలు కురిపించారు.

దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి. కలాం జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నివాళి అర్పించారు. దేశ రాష్ట్రపతి పదవిని అలంకరించిన మిగతా 2లో

- సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి
- మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా-2026
- మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది
- విజయవాడలో సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు
- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి, సీఎం
- మహిళాశక్తికి రాష్ట్రపతి ముర్ము స్ఫూర్తిదాయకమన్న చంద్రబాబు
- గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ గుర్తింపు తేవడమే మేళా ఉద్దేశం
- డ్వాక్రా సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని వెల్లడి
- త్వరలో డ్వాక్రా సంఘాల టర్నోవర్ రూ.10 లక్షల కోట్లు కావాలన్న సీఎం
- గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు స్వయం ఏపీ బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.
- మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

గ్రామీణ మహిళల ఉత్పత్తులకు
'స్వయం ఏపీ' బ్రాండ్

ఉపాధి కేంద్రాలుగా గ్రామాలు



గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు స్వయం ఏపీ బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల మిగతా 2లో

అబ్దుల్ కలాం వారసత్వాన్ని గౌరవిద్దాం



- అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళులర్పించారు.
- రామేశ్వరంలోని ఒక నిరాడంబర కుటుంబం నుంచి ఎదిగి, భారతదేశపు అత్యంత గౌరవనీయమైన శాస్త్రీయ నాయకులలో ఒకరిగా ప్రజల ఆరాధ్య రాష్ట్రపతిగా నిలిచిన దార్శనిక శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా వారిని స్మరించుకుందామని అన్నారు.

అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళులర్పించారు. రామేశ్వరంలోని మిగతా 2లో

సీఈసీని రక్షించేందుకే ఇదంతా: అభిజిత్ దీప్కే

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని సీజేపీ ఆరోపణ
- ఎన్నికల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని అభిజిత్ దీప్కే విమర్శ
- ప్రభుత్వానిది 'ఒకే దేశం, ఒకే పార్టీ' నినాదమని విమర్శలు
- నటుడు ప్రకాశ్ రాజ్, ఇతర నేతలతో కలిసి దీప్కే మీడియా సమావేశం



ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) మిగతా 2లో

పోటీ దేశాలపై పైచేయి సాధించడమే లక్ష్యం

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం
- భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో తొలి దశ పూర్తి
- ప్రస్తుతం ఒప్పందం లీగల్ డ్రాఫ్టింగ్ దశలో ఉందన్న కేంద్ర మంత్రి
- చర్చలు కొలిక్కి వస్తున్నాయన్న విదేశాంగ మంత్రి జైశంకర్



భారత్-అమెరికా మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పురోగతి లభించింది. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ట్రేడ్ డీల్‌లో మొదటి దశ ఖరారైందని, ప్రస్తుతం ఇది న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్టింగ్) దశలో ఉందని మిగతా 2లో

ఆర్థిక నేరాలకు పాల్పడిన జగన్‌తో సీజేపీ చేతులు కలిపారు



- వైసీపీ-సీజేపీ బంధంపై మాధవ్ విమర్శలు.. జగన్‌తో చేతులు కలపడంపై ప్రశ్నలు
- వైసీపీ-సీజేపీ బంధంపై బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఘాటుగా స్పందించారు.
- ఆర్థిక నేరాలకు పాల్పడిన జగన్‌తో సీజేపీ చేతులు కలిపారంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసీపీ-సీజేపీ బంధంపై బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఘాటుగా స్పందించారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన జగన్‌తో సీజేపీ చేతులు కలిపారంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి వ్యతిరేక పోరాటం, ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ నినాదాలు చేసే సీజేపీ.. అవినీతి ఆరోపణలకు మిగతా 2లో

- సంపద సృష్టికర్తలకు సహకారం
- సంపద సృష్టిలో ఎ పారిశ్రామికవేత్తలదే కీలక పాత్ర
- పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం భట్టి భరోసా
- పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.
- సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు సహకారం అందించేందుకు కృషిచేస్తానని స్పష్టం చేశారు.
- హైటెక్స్‌లో జరుగుతున్న సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్-2026 రెండో రోజు గురువారంనాటి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.
- పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి

సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు గార్డియన్‌గా ఉంటా



పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు సహకారం అందించేందుకు కృషిచేస్తానని స్పష్టం చేశారు. హైటెక్స్‌లో జరుగుతున్న సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్-2026 రెండో రోజు గురువారంనాటి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంపద సృష్టికర్తలకు మిగతా 2లో

మోదీతో విభేదాలున్నా.. దేశం జోలికొస్తే ఊరుకోం!




- ప్రధాని నరేంద్ర మోదీపై తరచూ విమర్శలు చేసే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పొలిటికల్ సర్‌ప్రైజ్ ఇచ్చారు.
- ఎలాన్ మస్క్ విషయంలో మాత్రం దేశ సార్వభౌమాధికారాన్ని ముందుకు తెచ్చారు.
- భారత్ ప్రధాని గురించి మాట్లాడే హక్కు.. ఇక్కడి వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారం మస్క్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు.

ప్రధాని నరేంద్ర మోదీపై తరచూ విమర్శలు చేసే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పొలిటికల్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఎలాన్ మస్క్ విషయంలో మాత్రం దేశ సార్వభౌమాధికారాన్ని ముందుకు తెచ్చారు. భారత్ ప్రధాని గురించి మాట్లాడే హక్కు.. ఇక్కడి వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారం మస్క్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన మిగతా 2లో

తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో 24/7 అందుబాటులో ఉండటం తప్పనిసరి

ఎక్కడా పోటీ లేకుండా ఉండకూడదు: సజ్జల

- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు అత్యంత కీలక బాధ్యత తీసుకుని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలోనే ఉండి పార్టీ అభ్యర్థులకు అన్ని విధాలా అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు
- పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-కోఆర్డినేషన్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శులు--కోఆర్డినేషన్, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల షెడ్యూల్, రిజర్వేషన్లు, నామినేషన్లకు సంబంధించిన ప్రక్రియకు చాలా తక్కువ సమయం ఇస్తున్నారని సజ్జల అన్నారు.



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు అత్యంత కీలక బాధ్యత తీసుకుని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలోనే ఉండి పార్టీ అభ్యర్థులకు అన్ని విధాలా అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. మిగతా 2లో

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం

కరెంట్ కోతలు.. అధికారులపై నెపమా రేవంత్: హరీశ్ రావు

బొగ్గు నిల్వలు, సమీక్షల్లో నిర్లక్ష్యం జరిగిందని విమర్శ


ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ

తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మిగతా 2లో

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్.. మహిళల భాగస్వామ్యం కీలకం

వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమైనది

- పున్నమిఘాట్‌లో జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు.
- విజయవాడకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని.. కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించిందన్నారు.
- దుర్గాదేవి ఉత్సవాల నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన సరస్ మేళాలో భాగంగా 'లఖ్‌పతి దీదీ' మేళాను నిర్వహించడం ఒక విశేషమైన కలయికగా భావిస్తున్నట్లు తెలిపారు.



పున్నమిఘాట్‌లో జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. విజయవాడకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని.. కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే మిగతా 2లో

సీఈసీని రక్షించేందుకే ఇదంతా: అభిజిత్ దీప్కే

జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వ వనరులను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నేతలు, నిరసనకారులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని గురువారం ఆరోపించారు.ఢిల్లీలో నటుడు ప్రకాశ్ రాజ్, మరో నేత నేహా బోరాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభిజిత్ దీప్కే మాట్లాడారు. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. "ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటం కోసం ఢిల్లీ యువత వీధుల్లో పోరాడుతుంటే వారిని ఈడ్చుకెళుతున్నారు. సొంత పౌరుల మీదనే ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. సీఈసీని రక్షించడానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?" అని దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఎన్నికల కమిషన్ తీరును, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దీప్కే తీవ్రంగా తప్పుబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి సహాయం చేస్తున్నారని ప్రజలు ఎందుకు అనుమానించకూడదని ప్రశ్నించారు.ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించిందని దీప్కే సంచలన ఆరోపణ చేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు ప్రకటించబడిన కొందరు వ్యక్తులను తాను కలిశానని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని ఉపయోగించి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని విమర్శించారు.ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని వెనుక ఉన్న అసలు అజెండా 'ఒకే దేశం, ఒకే పార్టీ' అని దీప్కే విమర్శించారు. దమ్ముంటే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. ంతర్జాతీయ సమాజం ఏమనుకుంటుందోనని ప్రధని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్యా షిండే నిరసన చేపట్టారు. పోలీస్ బారికేడ్లను దాటి నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై కేసు నమోదు చేసి, దాస్, రంకాలను జ్యుడీషియల్ కస్టడీకి పంపి తీహార్ జైలుకు తరలించారు. అజింక్యా షిండేను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీజేపీ లీగల్ టీం హెడ్ రత్నా సింగ్ తెలిపారు. తమ నేతల అరెస్టులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సీజేపీ స్పష్టం చేసింది.

పోటీ దేశాలపై పైచేయి సాధించడమే లక్ష్యం

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు."అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి తొలి విడత చర్చలు ఫలప్రదమయ్యాయి. ప్రస్తుతం దీనికి తుది మెరుగులు దిద్దుతున్నాం. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత, మన పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా ఈ ఒప్పందాన్ని అమలు చేస్తాం" అని పీయూష్ గోయల్ వివరించారు.ఇదే విషయంపై వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ, చర్చలు సానుకూల దిశలో సాగుతున్నాయని, వీలైనంత త్వరగా ఒప్పందం కొలిక్కి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో టారిఫ్ విధానంపై మరింత స్పష్టత వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు.విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం ఈ ఒప్పందంపై ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు తుది దశకు (ల్యాండింగ్ పాయింట్) చేరుకుంటున్నాయని, ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు దక్కే అదనపు ప్రయోజనాలే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.అయితే, అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ ఇటీవల మాట్లాడుతూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఇరు దేశాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, ఇది వెంటనే కార్యరూపం దాల్చే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ఇంకా పరిష్కారం కాని కొన్ని అంశాలపై ఇరు దేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.టారిఫ్ సమస్యలు, ఇతర అడ్డంకులను తొలగించి, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో 2025 ప్రారంభం నుంచి భారత్, అమెరికా మధ్య ఈ చర్చలు సాగుతున్నాయి. గతంలో అమెరికా విధించిన సుంకాలు, హెచ్1బీ వీసా ఫీజుల పెంపు, గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్‌పై ఆంక్షల వంటి పరిణామాలు ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపిన నేపథ్యంలో, తాజా పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆర్థిక నేరాలకు పాల్పడిన జగన్‌తో సీజేపీ చేతులు కలిపారు

సంబంధించి ఈడీ, సీబీఐ కేసులను ఎదుర్కొంటున్న జగన్‌తో చేతులు కలపడంతో అసలు అజెండా స్పష్టమవుతోందంటూ ఎక్స్ వేదికగా వ్యాఖ్యలు చేశారు. నాడు మత విద్వేషంతో తన పాలనలో రాష్ట్రంలోని దేవాలయాల విధ్వంసం, రథ దగ్ధం, విగ్రహాల శిరచ్ఛేదాలను, దేవాలయాల ఆస్తుల ఆక్రమణలను, మత మార్పిడులను జగన్ ప్రోత్సహించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని మండిపడ్డారు. నేడు రాజకీయ లబ్ధి కోసం దేశ విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపి తన నిజ స్వరూపాన్ని బట్టబయలు చేశాని వ్యాఖ్యానించారు.ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ పాలనలో ప్రతిపక్షాల హక్కులు, రాజకీయ స్వేచ్ఛకు ఎదురైన సవాళ్లను, ప్రజలు పడిన ఇబ్బందులను, అవినీతి ఆరోపణలను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదని మాధవ్ అన్నారు. శాంతియుత నిరసన ప్రజాస్వామ్య హక్కు అని... కానీ హింస, రాళ్లదాడులు, పోలీసులపై దాడులు, మహిళల పట్ల అనుచిత ప్రవర్తన, భద్రతా సిబ్బందిపై దాడులకు ప్రజాస్వామ్యంలో చోటులేదని స్పష్టం చేశారు. చట్టాన్ని అమలు చేసే పోలీసుల చర్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం మాజీ సీఎంకు బాధ్యతాయుతమైన వైఖరి కాదని అన్నారు.అవినీతి వ్యతిరేక పోరాటమని చెప్పుకునే జఙీ, అవినీతి కేసులను ఎదుర్కొంటున్న జగన్‌తో కలిసి పనిచేయడం వారి నినాదాలకు, ఆచరణకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని స్పష్టం చేస్తోందని బీజేపీ ఏపీ చీఫ్ అన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అస్థిరత, విధ్వంసాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తులతో కలిసి జగన్ సాగిస్తున్న రాజకీయ ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని.. తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా తీర్పును వెల్లడిస్తారని ఎక్స్‌లో మాధవ్ పోస్ట్ చేశారు.

మోదీతో విభేదాలున్నా.. దేశం జోలికొస్తే ఊరుకోం!

ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.భారత్‌లో స్టార్‌లింక్ సేవల ప్రారంభానికి అనుమతులు ఆలస్యమవుతున్నాయంటూ మస్క్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో.. దేశ వనరుల్ని ఎలా వినియోగించుకోవాలో నిర్ణయించేది భారతదేశమేనని ఒవైసీ కుండబద్దలు కొట్టారు. విదేశీయులు వచ్చి ఆదేశాలు ఇచ్చే పరిస్థితి ఉండకూడదని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీతో తనకు అనేక అంశాల్లో విభేదాలు ఉన్నప్పటికీ, ప్రధాని స్థానాన్ని అగౌరవపర్చడం, దేశ గౌరవానికి భంగం కలిగితే మాత్రం సహించబోనని అన్నారు.అంతేకాదు.. ప్రపంచంలోనే చౌక ధరకు ఇంటర్నెట్ లభించేది భారత్‌లోనని గుర్తు చేశారాయన. దేశంలో టెలికాం రంగానికి సంబంధించిన నిర్ణయాలు భారత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకోవాలని, విదేశీ వ్యాపారవేత్తల ఒత్తిడికి తలొగ్గకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే భారత్‌ను రష్యా చమురు కొనొద్దని చెబుతున్న అమెరికా.. అక్కడి నుంచి డీజిల్ కొంటున్న విషయాన్ని ప్రస్తావించారు. భారత్ కూడా తన ప్రయోజనాలే ముఖ్యంగా భావించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. భారతదేశ వనరులను ఎలా వినియోగించుకోవాలో నిర్ణయించేది ఈ దేశమేనని.. విదేశీ పారిశ్రామికవేత్తలు భారత్ విధానాలను శాసించే పరిస్థితి ఉండకూడదని అన్నారాయన. రాజకీయ విభేదాలు ఉన్నా దేశ గౌరవం, రాజ్యాంగబద్ధమైన పదవుల విషయంలో రాజీ పడకూడదన్న ఆయన వైఖరి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

అబ్దుల్ కలాం జయంతి.. వైఎస్ జగన్ నివాళి

ఆయన నిరాడంబర జీవితం అందరికీ ఆదర్శం అని ప్రశంసలు కురిపించారు.వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా..'విద్యతోనే వ్యక్తి ఎదుగుదల, యువశక్తితోనే దేశాభివృద్ధి సాధ్యమని నమ్మిన గొప్ప దార్శనికుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం. శాస్త్రవేత్తగా విశిష్ట సేవలందించి, దేశ రాష్ట్రపతి పదవిని అలంకరించిన ఆయన నిరాడంబర జీవితం అందరికీ ఆదర్శం. కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి అంటూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపి, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. కలాం జయంతి సందర్భంగా నివాళులు' అని పోస్టు చేశారు.సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల అక్రమ అరెస్ట్‌లను వ్యతిరేకించినందుకు, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ధన్యవాదాలు తెలిపారు. అభిజిత్ ఎక్స్ వేదికగా వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా.. అంతకుముందు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్.. సీజేపీ నేతల అరెస్ట్‌పై స్పందించారు. ఎక్స్ వేదికగా వైఎస్ జగన్.. ఎన్నికల ప్రక్రియలో లోపాలను సరిదిద్దాలి. ముందస్తు చర్యలతోనే మెరుగైన పరిష్కారం. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాలి. అరెస్టులతో సమస్య పరిష్కారం కాదు అంటూ వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్.. సీజేపీ నేతల అరెస్ట్‌పై స్పందించారు.

అబ్దుల్ కలాం వారసత్వాన్ని గౌరవిద్దాం

ఒక నిరాడంబర కుటుంబం నుంచి ఎదిగి, భారతదేశపు అత్యంత గౌరవనీయమైన శాస్త్రీయ నాయకులలో ఒకరిగా ప్రజల ఆరాధ్య రాష్ట్రపతిగా నిలిచిన దార్శనిక శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా వారిని స్మరించుకుందామని అన్నారు. ఆయన ప్రస్థానం విద్య, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం శక్తికి నిదర్శనమన్నారు. ఒక యువ వార్తాపత్రిక పంపిణీదారుడిగా పనిచేయడం నుంచి భారతదేశపు స్వదేశీ ఎస్‌ఎల్వి-××× ప్రయోగ వాహనం అభివృద్ధికి నాయకత్వం వహించారన్నారు. అగ్ని, పృథ్వీ క్షిపణి కార్యక్రమాలను ముందుకు నడిపించారన్నారు. పోఖ్రాన్-×× కు సహకరించారని, టెక్నాలజీ విజన్ 2020కి మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. ఆయన తన జీవితాన్ని భారతదేశపు శాస్త్రీయ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, అభివృద్ధి ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లడానికి అంకితం చేశారని చెప్పుకొచ్చారు.సామాన్యమైన ప్రారంభాలు గొప్ప ఆశయాలకు పరిమితి కాదని ఆయన జీవితం గుర్తు చేస్తుందని పవన్ అన్నారు. ఎదురుదెబ్బలు నేర్చుకోవడానికి అవకాశాలుగా మారగలవని, జ్ఞానాన్ని నిజాయితీ, వినయం, సమాజ సేవతో మేళవించడంలోనే నిజమైన విజయం ఉందనడానికి ఆయన జీవితమే ఉదహరణగా చెప్పుకొచ్చారు. అభివృద్ధి చెందిన భారత్‌పై ఆయనకున్న దార్శనికత, ప్రతి పౌరునికి, యువతకు, ఒక లక్ష్యంతో కలలు కనడానికి, పట్టుదలతో పనిచేయడానికి, దేశ నిర్మాణానికి దోహదపడటానికి ఒక పిలుపుగా నిలుస్తుందని అన్నారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి

రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో భౌగోళికంగా అనువైన ప్రాంతంలో ఉండటం, పారిశ్రామిక అవసరాలకు తగిన భూమి అందుబాటులో ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ద్వారా అభివృద్ధి చెందిన నైపుణ్యవంతమైన మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలాలని అన్నారు. హైదరాబాద్ వాతావరణం, బహుభాషా సంస్కృతి, వివిధ ప్రాంతాల ప్రజలను ఆదరించే సంప్రదాయం కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని పెట్టుబడులను తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్, ఫ్యూర్, రేర్ అనే మదు విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వాటి గురించి సవివరంగా భట్టి విక్రమార్క తెలిపారు. మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో సంపద సృష్టికి వ్యవసాయంతోపాటు పరిశ్రమలు, సేవారంగం కీలకంగా మారాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో వ్యవసాయ రంగం వాటా సుమారు 16 శాతం ఉండగా, పరిశ్రమలు, సేవారంగం కలిపి ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా దోహదపడుతున్నాయని వివరించారు. సేవారంగం వాటా సుమారు 65 శాతంగా ఉందని, పారిశ్రామిక రంగం కూడా ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఫార్మా, కోర్ ఇరిగేషన్లు, ఆక్వా, ఎగుమతులు, దిగుమతులు, ఐటీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు వంటి విభిన్న రంగాల్లో ఉన్న వ్యాపారవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింతగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టించే వారికి ప్రతి రాష్ట్రం, ప్రతి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు ఎదగడంతోపాటు రాష్ట్రానికి ఉపాధి, పెట్టుబడులు, ఆదాయం పెరగడానికి దోహదపడాలని ఆకాంక్షించారు.సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పెట్టుబడులకు అవసరమైన అనుమతులు, భూమి, విద్యుత్, నీరు వంటి సదుపాయాల కల్పనలో ప్రభుత్వ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయాలు, వ్యాపారం, సినీ పరిశ్రమ, వ్యవసాయం, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం తదితర అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందని చెప్పారు.సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమ అనుభవం, పరిజ్ఞానాన్ని ఇతర వర్గాలతో పంచుకోవాలని, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. సమాఖ్య వంటి సంస్థల ద్వారా ఈ తరహా కార్యక్రమాలకు వేదికలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కూడా వారితో కలిసి పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలికిన భట్టి విక్రమార్క వ్యాపారాలు విస్తరించుకుంటూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు సహకరించాలని కోరారు.రాబోయే రోజుల్లో అచ్చంపేటను పర్యా టక జంక్షన్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఉప ము ఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ప లు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వ ర్యంలో కాంగ్రెస్ శ్రేణులు, అధికారులు మన్ననూ రు వద్ద ఉప ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలి కారు. స్థానిక నిరంజన్‌షావలి దర్గా, లింగమయ్య ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. మన్ననూరులోని అంబేద్కర్, గద్దర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బస్టాండ్‌లో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫల కాలను ప్రారంభించారు. అనంతరం మన్ననూరు పురుగులగుట్ట వద్ద రూ.53.84కోట్ల వ్యయంతో నిర్మించనున్న 220/33కేవీ సబ్ స్టేషన్, అమ్రాబా ద్ నుంచి మద్దిమడుగు వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు, పదర మండలం రాయలగండి లో చెన్నకేశవస్వామి ఆలయం వద్ద రూ.50లక్షల తో రాజగోపుర నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాలను ప్రారంభించారు.

గ్రామీణ మహిళల ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్

లబ్ధిదారులుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని, మరో ఐదు లక్షల మందిని ఆ దిశగా తీర్చిదిద్దు తామని ప్రకటించారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల వేళ జాతీయ సరస్ మేళా నిర్వహించడం విజయవాడకు మరింత శోభ తెచ్చిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి ఉపాధ్యాయురాలిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె.. ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించారని కొనియాడారు. సంకల్ప బలం, ధైర్యం ఉంటే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆమె నిరూపించారని తెలిపారు. జాతీయ సరస్ మేళాలో 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని సీఎం తెలిపారు. ఇది కేవలం 14 రోజులపాటు జరిగే ప్రదర్శన కాదని, గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల మహిళలు తమ అనుభవాలను పంచుకోవడంతోపాటు విజయగాథలను తెలుసుకోవాలని, కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు.

రూ.69 వేల కోట్ల టర్నోవర్‌తో డ్వాక్రా సంఘాలు

ఆంధ్రప్రదేశ్‌లో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు, 1.10 కోట్ల మంది సభ్యులు ఉన్నారని చంద్రబాబు తెలిపారు. ఈ సంఘాల ద్వారా రూ.69 వేల కోట్ల టర్నోవర్ నమోదవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు 3.5 కోట్ల మందికి చేరుతున్నాయని వివరించారు. గతంలో వెలుగు కార్యక్రమం ద్వారా మహిళలు సంపద సృష్టించే దిశగా అడుగులు వేశారని గుర్తుచేశారు. నిన్నటి వరకు పొదుపు సంఘాలుగా ఉన్న ఎస్ హెచ్ జీలు నేడు వ్యాపార సంస్థలుగా ఎదుగుతున్నాయని.. భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాలని సీఎం ఆకాంక్షించారు. మహిళలు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా స్వయం ఏపీ పేరుతో మార్కెటింగ్ చేస్తామని తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ మార్కెట్ల నుంచి ప్రపంచ మార్కెట్ల వరకు మహిళల ఉత్పత్తులు చేరేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించు కున్నప్పుడే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించడం, వారి ఆలోచనలకు విలువ ఇవ్వడం, కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన అవకాశాలు, సహకారం అందించడం సమాజ బాధ్యత అని అన్నారు.

ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలి

సంక్షేమ పథకాలతో మహిళలకు భరోసా కల్పిస్తూనే, ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం పథకంతో పిల్లల చదువుకు అండగా నిలుస్తున్నామని, దీపం పథకంతో మహిళల ఖర్చులను తగ్గిస్తున్నామని చెప్పారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 100 కోట్ల ప్రయాణాలు చేశారని వెల్లడించారు. మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు సహా పలు ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం నుంచి అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని వివరించారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక చిన్న ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. మహిళల భద్రత, ఆత్మగౌరవం, సాధికారతకు ప్రాధాన్యమిస్తూ స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు. ఇంట్లోని ప్రతి మహిళను ప్రోత్సహించాలని, వారి కలలు నిజం చేసుకునేందుకు కుటుంబ సభ్యులు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్రగవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, అనిత తదితరులు హాజరయ్యారు.విజయవాడలోని పున్నమి ఘాట్‌లో 'జాతీయ సరస్ మేళా' వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఈ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల నైపుణ్యానికి, వారి ఉత్పత్తులకు వేదికగా నిలిచే ఈ కార్యక్రమానికి కనకదుర్గమ్మ సన్నిధి, కృష్ణమ్మ తీరం వేదిక కావడం విశేషం.సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ విజయవాడలో ఈ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీ తర్వాత తొలిసారిగా ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపారు. పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపది ముర్ము జీవితం మహిళలందరికీ ఆదర్శమని కొనియాడారు. మహిళలు సంకల్పిస్తే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలరని ముర్ము నిరూపించారని ప్రశంసించారు.

తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో 24/7 అందుబాటులో ఉండటం తప్పనిసరి

పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-కోఆర్డినేషన్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శులు--కోఆర్డినేషన్, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల షెడ్యూల్, రిజర్వేషన్లు, నామినేషన్లకు సంబంధించిన ప్రక్రియకు చాలా తక్కువ సమయం ఇస్తున్నారని సజ్జల అన్నారు. ఈ పరిస్థితుల్లో ఒక పని తర్వాత మరో పని చేసే అవకాశం లేకుండా, అభ్యర్థుల ఎంపిక, పత్రాల సిద్ధత, నామినేషన్లు, ప్రచారం అన్నీ సమాంతరంగా జరగాల్సి వస్తోందని చెప్పారు.పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ స్పష్టంగా చెప్పినట్లుగా, ఎక్కడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి లేకుండా పోటీ జరగకూడదని, ఏ స్థానం క

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

కచ్చితంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు నిబంధనల ప్రకారం నిర్వహణ

స్థానిక ఎన్నికల షెడ్యూల్, మార్గదర్శకాలను వెల్లడించిన జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి





కర్నూలు ప్రతినిధి, అక్టోబర్ 15, (సీమకిరణం న్యూస్) : జిల్లాలో పట్టణ స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, అభ్యర్థుల వ్యయ పరిమితులు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై మార్గదర్శకాలను మీడియా సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు నగరపాలక సంస్థ, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 14న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని వివరించారు. అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 21న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించి, అదే రోజు సాయంత్రం తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారని తెలిపారు. అక్టోబర్ 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారని, అవసరమైతే అక్టోబర్ 29న రీపోలింగ్ చేపడతారని పేర్కొన్నారు. అక్టోబర్ 30న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని వివరించారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్ 19న విడుదల కానుందని తెలిపారు. అక్టోబర్ 21 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై, అక్టోబర్ 23న ముగుస్తుందని పేర్కొన్నారు. అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 25న తిరస్కరణకు గురైన నామినేషన్లపై అప్పీళ్లు, అక్టోబర్ 26న అప్పీళ్ల పరిష్కారం ఉంటుందని వివరించారు. అక్టోబర్ 27న నామినేషన్ల ఉపసంహరణతో పాటు తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారని, నవంబర్ 3న పోలింగ్, అవసరమైతే నవంబర్ 4న రీపోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని వివరించారు.

మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు

గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు.

మొదటి దశ: నవంబర్ 13న నోటిఫికేషన్, నవంబర్ 15న ఆర్ఓ/ఈఓ నోటీసు, నవంబర్ 17 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 18న పరిశీలన, నవంబర్ 19న అప్పీళ్లు, నవంబర్ 21న అప్పీళ్ల పరిష్కారం, ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన ఉంటాయని తెలిపారు. నవంబర్ 26న పోలింగ్, అవసరమైతే నవంబర్ 27న రీపోలింగ్, ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారని వివరించారు.

రెండో దశ: నవంబర్ 16న నోటిఫికేషన్, నవంబర్ 18న నోటీసు, నవంబర్ 20 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 21న పరిశీలన, నవంబర్ 22న అప్పీళ్లు, నవంబర్ 23న అప్పీళ్ల పరిష్కారం, నవంబర్ 24న ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన ఉంటాయని పేర్కొన్నారు. నవంబర్ 29న పోలింగ్ నిర్వహించి, ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారని వివరించారు.

మూడో దశ: నవంబర్ 19న నోటిఫికేషన్, నవంబర్ 21న నోటీసు, నవంబర్ 23 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 24న పరిశీలన, నవంబర్ 25న అప్పీళ్లు, నవంబర్ 26న అప్పీళ్ల పరిష్కారం, నవంబర్ 27న ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటాయని వివరించారు. డిసెంబర్ 2న పోలింగ్, అవసరమైతే డిసెంబర్ 3న రీపోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. కుల, మత, ప్రాంతీయ భావాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, వ్యక్తిగత అంశాలను ప్రస్తావిస్తూ ఎన్నికల వాతావరణానికి భంగం కలిగించరాదని స్పష్టం చేశారు. సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి సంబంధిత అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్ల వినియోగం చేయరాదని తెలిపారు. ప్రభుత్వ భవనాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారులు తదితర ప్రాంతాల్లో అనుమతి లేకుండా పోస్టర్లు, హోర్డింగ్‌లు, ప్రచార సామగ్రి ఏర్పాటు చేయరాదని తెలిపారు. ప్రైవేట్ ఆస్తులపై కూడా యజమానుల అనుమతి లేకుండా పోస్టర్లు అంటించడం, ప్రచార సామగ్రి ఏర్పాటు చేయడం నిషేధమని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం (గూజు) పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న సేవలను అభ్యర్థులు, ఓటర్లు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. పోర్టల్‌లో అందుబాటులో ఉన్న సదుపాయాల మేరకు ఆన్‌లైన్ నామినేషన్ల దాఖలు, ఓటరు స్లిప్పుల డౌన్‌లోడ్, పోలింగ్ కేంద్రాల వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు సంబంధించి అధికారిక మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితులను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఖర్చుల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేసి, అవసరమైన లెక్కలను నిర్వహించాలని సూచించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు సంబంధించిన మార్గదర్శకాలను అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు, సమస్యలు ఉంటే 1800 425 4299 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు.. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ....స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై బైండ్ ఓవర్ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జాయింట్ కార్డన్ సెర్చ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలతో పాటు ప్రత్యేక ట్రైకింగ్ ఫోర్స్‌ను మోహరించి, నిరంతర నిఘా కొనసాగిస్తామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించేందుకు పోలీసు, రెవెన్యూ శాఖలతో సంయుక్త బృందాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణ స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

అక్రమ ఏకగ్రీవాలపై ఆర్‌డీఓ ఆధ్వర్యంలో సమగ్ర విచారణ -- జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. నామినేషన్ ప్రక్రియ, ఎన్నికల నిబంధనలు, అవసరమైన ధ్రువపత్రాలు, డిక్లరేషన్ల సమర్పణపై పోటీ చేయనున్న అభ్యర్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏకగ్రీవ ఎన్నికల విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తామని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో శ్రీభువన గాయత్రి మాత



కర్నూలు ప్రతినిధి నజీర్, అక్టోబర్ 15, (సీమకిరణం న్యూస్): దసరా పండుగ దేవి నవరాత్రుల సందర్భంగా కర్నూలు జిల్లా వెల్దుర్తి నేషనల్ హైవే 44 సమీపంలో వెలసిన శ్రీ భువన గాయత్రి ఆలయంలో ఐదవ రోజు లలిత త్రిపుర సుందరి అలంకారం లో శ్రీ భువనగాయత్రీ మాత భక్తుల కు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు శ్రీ భువన గాయత్రి యజ్ఞము నిర్వహించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరి సింహనాయుడు దంపతులు అమ్మ వారికి నూతన వస్త్రాలు ఒడి బియ్యం సమర్పించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ భువన గాయత్రి మాత ఆశిస్సులతో అందరూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వుండాలని హరి సింహ నాయుడు దంపతులు మరియు ఆలయ నిర్వాహకులు పీఠాధిపతి బాలకృష్ణ ఆచారి స్వామి మరియు ఆలయ అభివృద్ధి కమిటీ వారు తెలిపారు ప్రతి ఒక్కరూ శరణ్ణవరాత్రుల సందర్భంగా శ్రీ భువన గాయత్రి మాత ను దర్శించుకోవాలని వారు కోరారు.

లలిత త్రిపుర సుందరి దేవిగా శ్రీ వాసవి మాత

భక్తిశ్రద్ధలతో అమ్మవారి దర్శనం



ప్యాపిలి అక్టోబర్ 15 (సీమ కిరణం న్యూస్): దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ప్యాపిలి పట్టణంలోని అమ్మవారి శాలలో ఐదో రోజు శ్రీ వాసవి మాత శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రి ఉత్సవాలతో అమ్మవారి శాల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

ఎస్సై నాగార్జున



ప్యాపిలి అక్టోబర్ 15(సీమ కిరణం న్యూస్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ట్రబుల్ మాంగర్స్‌కు ఎస్ఐ నాగార్జున కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వక భేటీ

మంగళగిరి చేనేత చీర, ఏటికొప్పాక కళాకృతిని బహూకరించిన మంత్రి



విజయవాడ ప్రతినిధి, అక్టోబర్ 15 (సీమకిరణం న్యూస్): రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, సరస్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్రపతిని మంత్రి లోకేష్ గురువారం ఉదయం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మంత్రి నారా లోకేష్ శాలువాతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర చేనేత కళలకు ప్రతీకగా నిలిచే మంగళగిరి చేనేత చీరతో పాటు, ఆంధ్రప్రదేశ్ కళా వైభవాన్ని చాటిచెప్పే ఏటికొప్పాక కళాకృతిని రాష్ట్రపతికి బహూకరించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో మంత్రి లోకేష్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర సంప్రదాయ కళలు, చేనేత వైభవానికి ప్రతీకలైన కానుకలను అందజేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

కలశయాత్రను ప్రారంభించిన మంత్రి టీజీ భరత్

అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సంతోషంగా ఉండాలి -- మంత్రి టీజీ భరత్



కర్నూలు ప్రతినిధి, అక్టోబర్ 15 (సీమకిరణం న్యూస్): కర్నూలు నగరంలోని రాంబొట్ల దేవాలయం వద్ద కలశయాత్రను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. చిన్న అమ్మవారి శాలలో కొలువైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మూలా నక్షత్రం సందర్భంగా 108 కలశాలతో తీసుకొచ్చిన పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించేందుకు ఈ కలశయాత్ర చేపట్టారు. మహిళలు రాంబొట్ల దేవాలయం నుంచి చిన్న అమ్మవారి శాల వరకు 108 కలశాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా ఈ ఆచారాన్ని భక్తులు కొనసాగించడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, రైతులందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చిన్న అమ్మవారి శాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కలశయాత్రలో కమిటీ చైర్మన్ టీజీ శివరాజు, అధ్యక్షుడు జూటూరు గోపాలయ్య, కార్యదర్శి చిలకలూరి సందకిషోర్, ఉపాధ్యక్షుడు శేషగిరి శెట్టి, మహిళా విభాగం నాయకురాలు జ్ఞానేశ్వరమ్మతో పాటు పలువురు కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



వైద్య విద్యలో శరీర నిర్మాణ శాస్త్రానిది కీలక పాత్ర

కర్నూలు వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్

కర్నూలు వైద్య కళాశాలలో ప్రపంచ అనాటమీ దినోత్సవ వేడుకలు





కర్నూలు క్రైమ్, అక్టోబర్ 15, (సీమకిరణం న్యూస్) : వైద్య విద్యలో శరీర నిర్మాణ శాస్త్రం (అనాటమీ) కీలక పాత్ర పోషిస్తుందని కర్నూలు వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్ అన్నారు. వైద్య విద్యకు శరీర నిర్మాణ శాస్త్రం పునాది వంటిదని, ఈ అంశంపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు. కర్నూలు వైద్య కళాశాలలో శరీర నిర్మాణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ అనాటమీ దినోత్సవ వేడుకలను వారం రోజులుగా నిర్వహించారు. ఇందులో భాగంగా అక్టోబర్ 14న 2026 బ్యాచ్‌కు చెందిన ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు వక్తృత్వం, రంగవల్లులు, బాడీ పెయింటింగ్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వంద మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను, సృజనాత్మకతను ప్రదర్శించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం..

ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాటు పాల్గొన్న విద్యార్థులకు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్, జనరల్ సర్జరీ ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ హరిచరణ్ బహుమతులను అందజేశారు. "శరీర నిర్మాణ శాస్త్ర ప్రాధాన్యం" అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

శరీర దాతల పట్ల కృతజ్ఞతాభావం పెంపొందించడమే లక్ష్యం...

వైద్య విద్యకు పునాదిగా నిలిచే శరీర నిర్మాణ శాస్త్రంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడం, సృజనాత్మక అభ్యాసాన్ని ప్రోత్సహించడం, శరీర దాతల పట్ల కృతజ్ఞతాభావాన్ని పెంపొందించడం ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. అనాటమీ విభాగ అధ్యాపకులు కార్యక్రమాల నిర్వహణలో సహకరించడంతో పాటు విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డాక్టర్ శోభాదేవి, ప్రొఫెసర్ డాక్టర్ వాణిశ్రీ, అనాటమీ విభాగ అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహనకు సీఎంఈ

వైద్య సదస్సు పోస్టర్ విడుదల



కర్నూలు వైద్యం, అక్టోబర్ 15, (సీమకిరణం న్యూస్) : మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు, వ్యాధి నిర్ధారణ, చికిత్సా విధానాలపై వైద్యులకు మరింత అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ నెల 27వ తేదీన కర్నూలు మెడికల్ కాలేజీలో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ హరిచరణ్ తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ జనరల్ సర్జరీ విభాగం, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఐఎంఏ ఉమెన్స్ వింగ్ సహకారం అందించనుంది. గురువారం ప్రిన్సిపల్ ఛాంబర్‌లో సీఎంఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిచరణ్ మాట్లాడుతూ ప్రతి మహిళకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన ఉండటం ఎంతో అవసరమన్నారు. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స పొందే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు అధిక సంఖ్యలో సీఎంఈ కార్యక్రమంలో పాల్గొని, బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించిన తాజా వైద్య పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వైద్యులకు క్రెడిట్ అవర్స్ కూడా లభిస్తాయని తెలిపారు. జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి శ్యామల మాట్లాడుతూ సీఎంఈలో పాల్గొనే వారికి ఉచితంగా సోనోమామోగ్రామ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీన వైద్య విద్యార్థులకు బ్రెస్ట్ క్యాన్సర్ అంశంపై వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓపీ నంబర్ 14లో ప్రతిరోజూ బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సి.ఎస్.కె. ప్రకాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి శ్యామల, ఐఎంఏ ఉమెన్స్ వింగ్ కార్యదర్శి డాక్టర్ విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.



ఏపీ ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు అక్టోబర్ 31 వరకు అవకాశం

కర్నూలు ప్రతినిధి, అక్టోబర్ 15 (సీమకిరణం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (APOSS) ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాల గడువును ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా అక్టోబర్ 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వై. సుధాకర్ తెలిపారు. చదువును మధ్యలో ఆపేసిన వారు, వివిధ కారణాలతో సాధారణ పాఠశాలల్లో విద్యను కొనసాగించలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. 14 సంవత్సరాల వయస్సు నిండిన అభ్యర్థులు పదో తరగతిలో, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఓపెన్ స్కూల్ విధానం ద్వారా విద్యను కొనసాగించాలనుకునే అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు, నిబంధనలు, అవసరమైన ధ్రువపత్రాల సమాచారం కోసం www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వై. సుధాకర్ సూచించారు. విద్యకు దూరమైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ విద్యార్హతలను పెంపొందించుకోవాలని ఆయన కోరారు.

భారీగా దిగొచ్చిన బంగారం ధరలు.. పండుగల వేళ బిగ్ రిలీఫ్.. అక్టోబర్ 15న తులం ఎంతంటే..?



బంగారం, వెండి ధరలపై గుడ్ న్యూస్. ధరలు భారీగా దిగొస్తున్నాయి. పండుగ సమయంలో రోజురోజుకు పతనమవుతూ వస్తోన్నాయి. ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ త్వరలో వడ్డీ రేట్లను మరోసారి పెంచనుందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో గోల్డ్ రేట్లు పడిపోతూ వస్తున్నాయి. సెప్టెంబర్ 15న గురువారం ధరలు ఇలా. బంగారం, వెండి ధరలు భారీగా తగ్గుతున్నాయి. గత కొద్ది రోజులుగా ధరలు పతనమవుతూ వస్తున్నాయి. ఈ వారం ప్రారంభం నుంచే రేట్లు డౌన్ అవుతున్నాయి. పండుగల సీజన్ క్రమంలో చాలామంది బంగారం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలో ధరలు తగ్గుతుండటం కొనుగోలు చేసేవారికి ఊరటగా చెప్పవచ్చు. అమెరికా డాలర్ బలపడుతుండటంతో పసిడి ధరలు దిగొస్తున్నాయి. ఇదేకాక అంతర్జాతీయ పరిణామాలు, ఫెడ్ వడ్డీ రేట్లపై అంచనాపై ధరలు తగ్గుదలకు కారణమవుతున్నాయి. అక్టోబర్ 15వ తేదీన గురువారం దేశంలోని వివిధ ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయనేది ఒకసారి చూద్దాం.

బంగారం ధరలు ఇవే..

-హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,48,250 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,35,890గా ట్రేడవుతోంది.

-విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,48,250గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,35,890 వద్ద కొనసాగుతోంది.

-చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,48,250గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,35,890 వద్ద ట్రేడవుతోంది.

-దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,48,400 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,36,040 వద్ద ట్రేడవుతోంది.

-బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,48,250 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,35,890 వద్ద ట్రేడవుతోంది.

వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

-దేశ రాజధాని ఢిల్లీలో కేజీ సిల్వర్ ధర రూ.2,34,900 వద్ద కొనసాగుతోంది.

-హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2,44,900గా ఉంది.

-చెన్నైలో కిలో సిల్వర్ రేటు రూ.2,44,900 వద్ద ట్రేడవుతోంది. నిన్న ఈ రేటు రూ.2.45 లక్షలుగా ఉంది.

-బెంగళూరులో కిలో సిల్వర్ రేటు రూ.2,34,900 వద్ద కొనసాగుతోండగా.. నిన్న ఈ రేటు రూ.2.35 లక్షలుగా ఉంది.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తీపికబురు.. ఒక ఇంటికి అదనంగా రూ.72,000 ఆర్థిక సాయం!



ఈ డేటా ఎంట్రీ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా అదనపు ఆర్థిక సహాయం జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సాయంతో పాటు కేంద్రం నుంచి అందే ఈ అదనపు.. తెలంగాణలో పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ ఇళ్ల' పథకానికి సంబంధించి మరో కీలక నిర్ణయం వెలువడింది. ఈ స్కీమ్‌ను కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' (గ్రామీణ్) రూరల్ పోర్టల్‌తో అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా లబ్ధిదారులకు అదనపు ఆర్థిక భరోసా లభించనుంది.

కేంద్ర నిధుల జోడింపు:

పీఎం ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద తెలంగాణకు మంజూరైన ఇళ్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇందుకు రూ.72,000 చొప్పున సాయం అందించనుంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయానికి తోడు, ఈ కేంద్ర నిధులు కూడా తోడవడంతో లబ్ధిదారులకు మరింత వెసులుబాటు కలగనుంది. ఇవే కాకుండా స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణ నిధులు, ఉపాధి హామీ పథకం కింద పనిదినాల వేతనాలు కూడా అదనంగా అందనున్నాయి.

డేటా అప్‌లోడ్ ప్రక్రియ వేగవంతం:

ఈ పథకం ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా రెండు విడతలుగా లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. తొలి దశలో ఇప్పటికే గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న, నిర్మాణంలో ఉన్న లబ్ధిదారుల వివరాలను పీఎం ఆవాస్ యోజన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇక రెండో విడతలో గుడిసెలు, తాత్కాలిక ఇళ్లలో జీవిస్తున్న మరో 25 వేల మంది పేదలను గుర్తించి వారి వివరాలను నమోదు చేయనున్నారు. ఈ డేటా ఎంట్రీ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా అదనపు ఆర్థిక సహాయం జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సాయంతో పాటు కేంద్రం నుంచి అందే ఈ అదనపు నిధుల వల్ల పేదలకు ఇళ్ల నిర్మాణం మరింత సులువు కానుంది.

రైలు కిటికీ నుంచి ప్యాసింజర్ ఫోన్ దొంగిలిద్దాం అనుకున్నాడు.. ఆ తర్వాత ఏమైందో చూడండి

ఓ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్న ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. రైలు కదులుతున్న సమయంలో మొబైల్ ఫోన్ చోరీకి ప్రయత్నించాడనే అనుమానంతో ఓ వ్యక్తిని ప్రయాణికులు పట్టుకున్నారు. అయితే, ఆ తర్వాత జరిగిన పరిణామాలు ప్రమాదకరంగా మారాయి. బీహార్‌లో షాకింగ్ ఘటన.. కదులుతున్న రైలు కిటికీకి వేలాడిన వ్యక్తి.. అసలేం జరిగిందంటే? బీహార్‌లోని ఓ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్న ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. రైలు కదులుతున్న సమయంలో మొబైల్ ఫోన్ చోరీకి ప్రయత్నించాడనే అనుమానంతో ఓ వ్యక్తిని ప్రయాణికులు పట్టుకున్నారు. అయితే, ఆ తర్వాత జరిగిన పరిణామాలు ప్రమాదకరంగా మారాయి. కదులుతున్న రైలు కిటికీకి ఆ వ్యక్తి వేలాడుతూ కనిపించిన వీడియో వైరల్‌గా మారింది. వరాల్లోకి వెళ్తే.. బీహార్‌లోని భాగల్‌పూర్ జిల్లాలో ఉన్న శివనారాయణ్‌పూర్ రైల్వే స్టేషన్ వద్ద జరిగింది. ట్రైన్ స్టేషన్ నుంచి బయలుదేరుతున్న టైమ్‌లో కిటికీ ద్వారా ప్రయాణికుడి మొబైల్ ఫోన్‌ను లాక్కునేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించినట్లు సమాచారం. అప్రమత్తమైన ప్రయాణికులు వెంటనే అతడిని పట్టుకున్నారు.

కదులుతున్న రైలు కిటికీకి వేలాడుతూ..

ఆ వ్యక్తి తప్పించుకోకుండా ప్రయాణికులు అతడి చేతులను పట్టుకున్నారు. ఇంతలో రైలు ముందుకు కదలడంతో అతడు కిటికీ బయట వేలాడుతూ కనిపించాడు. రైలు కదులుతున్నప్పటికీ అతడిని కొంతదూరం వరకు అలాగే పట్టుకున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. చివరకు అతడు ప్లాట్‌ఫామ్‌పై పడిపోయాడు. ఈ దృశ్యాలు ఇప్పుడుసోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై రైల్వే భద్రతా సిబ్బంది స్పందించారు. అయితే, ఘటనకు సంబంధించిన వివరాలు, ఆ వ్యక్తి పాత్రపై అధికారిక దర్యాప్తు కీలకం కానుంది. మొబైల్ చోరీకి ప్రయత్నించాడనే ఆరోపణను నిర్ధారిత వాస్తవంగా పరిగణించకూడదు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

జేసీ, డీఎస్ఓలకు వినతిపత్రం అందజేత

కమిషన్ పెంపు నుంచి పెన్షన్ వరకు పలు డిమాండ్లు



కర్నూలు ప్రతినిధి, అక్టోబర్ 15 (సీమకిరణం న్యూస్): రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ) రాజా రఘువీర్‌లకు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దీవి లీల మాధవరావు పిలుపు మేరకు గురువారం జిల్లా అధ్యక్షుడు మహబూబ్ బాషా, కార్యనిర్వాహక అధ్యక్షురాలు హంతుల్లాబి ఆధ్వర్యంలో డీలర్లు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

క్యూఆర్ కోడ్ విధానంతో ఇబ్బందులు...

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహబూబ్ బాషా, ప్రతినిధులు రమణ గౌడ్, తాయప్ప, వై. ఈరన్న, మధుసూదన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధానం వల్ల రేషన్ కార్డుదారులు, డీలర్లు, లారీ హమాలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొన్ని గోనె సంచులకు స్కానింగ్ జరగకపోవడంతో వాటిలోని సరుకుల పంపిణీలో జాప్యం ఏర్పడుతోందని, ఫలితంగా గ్రామాలు, వార్డుల్లో సమస్యలు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. డీలర్లకు పనికి తగిన గౌరవ వేతనం లేకపోవడం, ప్రస్తుత కమిషన్లు సరిపోకపోవడం, సరైన తూకాలు అందకపోవడం, గతంలో సరఫరా చేసిన గోనె సంచులకు సంబంధించిన డబ్బులు చెల్లించకపోవడం వంటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

డీలర్ల ప్రధాన డిమాండ్లు...

డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు ఉంచారు.

- రేషన్ డీలర్ల కమిషన్‌ను రూ.200 పెంచాలి.
- డోర్ డెలివరీకి అదనపు సర్వీస్ ఛార్జీలు చెల్లించాలి.
- డీలర్ సహాయకులకు సేవా రుసుము కింద నెలకు రూ.5,000 ఇవ్వాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో షాపుల అద్దెకు రూ.5,000, పట్టణ ప్రాంతాల్లో రూ.7,500 చెల్లించాలి.
- గోనె సంచుల విషయంలో 2019 జీవో నంబర్ 5ను వెంటనే అమలు చేయాలి.
- మట్టి ఖర్చుల కింద రూ.15,000 చెల్లించాలి.
- డీలర్లకు సంక్షేమ నిధి, పెన్షన్, ఇన్సూరెన్స్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలి.
- డీలర్ల కుటుంబాలకు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.
- రేషన్ షాపుల రేషనలైజేషన్ విధానాన్ని అమలు చేసి, డీలర్లకు సమాన కార్డులు, సమాన కేటాయింపులు, సమాన కమిషన్ విధానం అమలు చేయాలి

ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి...

1955 ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, పీడీఎస్ కంట్రోల్ యాక్ట్ నిబంధనల ప్రకారం రేషన్ సరుకుల విక్రయాలు, డీలర్ల విధులకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలని నాయకులు కోరారు. డీలర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక, పరిపాలనా సమస్యలను ప్రభుత్వం గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ఖాజాముద్దీన్‌తో పాటు రఫీఖ్, నాగూర్ భాష, సాజిదుల్లా, చంద్రశేఖర్, ఆదమలి, మధు, మన్సూర్, వెంకటరాముడు, రామకృష్ణ, శాంత శీన, అబ్బాస్, గంగన్న, రాము, రాబియా, శివ తదితర రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

డాక్టర్ పోచా శ్రీకాంత్ రెడ్డి హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

శాస్త్రీయ దర్యాప్తు.. సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌తో నిందితులకు శిక్ష



కర్నూలు క్రైమ్, నంద్యాల ప్రతినిధి, డోన్ , అక్టోబర్ 15 (సీమకిరణం న్యూస్): డాక్టర్ పోచా ప్రభాకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ పోచా శ్రీకాంత్ రెడ్డి హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ కర్నూలు జిల్లా నాలుగో అదనపు సెషన్స్ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. శాస్త్రీయ పద్ధతుల్లో పోలీసులు చేపట్టిన దర్యాప్తు, ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో నిందితులకు శిక్ష పడింది.

కేసు నేపథ్యం..

డోన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 120/2018గా కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 120(బీ), 420, 302, 201, 109 తో/ఎ 34 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి డోన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు, డోన్ సీఐ రాజగోపాల్ నాయుడు శాస్త్రీయ పద్ధతుల్లో సమగ్రంగా దర్యాప్తు నిర్వహించి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు.

ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు..

ఈ కేసును విచారించిన కర్నూలు జిల్లా నాలుగో అదనపు సెషన్స్ న్యాయమూర్తి లీలావతి ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు.

జీవిత ఖైదు పడిన నిందితులు:

- A-1: మురారి నరసింహ
- A-2: మురారి చంద్రశేఖర్
- A-3: మురారి నాగరత్న

ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస భట్ న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కేసు విచారణలో ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, నరేంద్ర కుమార్ సాక్షుల విచారణలో కీలకంగా వ్యవహరించారు. కోర్టు కానిస్టేబుళ్లు అల్లి పీరా, బషీర్‌తో పాటు జమీ ఏఎస్ఐ రవి రావు, కృష్ణమోహన్ రెడ్డి కేసు విచారణ సజావుగా సాగేందుకు కృషి చేశారు.

పోలీసు అధికారులకు అభినందనలు

ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, న్యాయస్థానంలో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని నంద్యాల జిల్లా ఎస్పీ, డోన్ డీఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా డోన్ పట్టణ సీఐ మాట్లాడుతూ, తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయంతో న్యాయస్థానాల్లో నేరాలను నిరూపించేందుకు కృషి చేస్తూ బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ పనిచేస్తుందని పేర్కొన్నారు.

నేరాలకు పాల్పడితే చట్టం నుంచి తప్పించుకోలేరు

హత్యలు, కుట్రలు, మోసాలు, సాక్ష్యాధారాలను ధ్వంసం చేయడం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడితే చట్టం నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదని డోన్ పట్టణ పోలీసులు హెచ్చరించారు. నేరాలకు సంబంధించిన ఆధారాలను శాస్త్రీయంగా సేకరించి, సమగ్ర దర్యాప్తుతో న్యాయస్థానంలో నేర నిరూపణకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, న్యాయ పరిరక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

వామ్మో ప్రయాణికుల కోసం ఇన్ని రైళ్లా.. తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్‌న్యూస్..!



ఈ ప్రత్యేక రైళ్లు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడనుంది. పూజా పండగ, 79వ వార్షిక నిరన్‌కారి సంతో సమాగమ్ - 2026 రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే పలు మార్గాలలో. దక్షిణ మధ్య రైల్వే సంచలన నిర్ణయాలు తీసుకుంటుంది. పండగ సీజన్ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు బోలెడు రైళ్లను నడుపుతోంది. పండగల సీజన్‌లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరుగుతుండటంతో ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ ప్రత్యేక రైళ్లు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడనుంది. పూజా పండగ, 79వ వార్షిక నిరన్‌కారి సంతో సమాగమ్ -- 2026 రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే పలు మార్గాలలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయితే రోజురోజుకు చాలా ప్రత్యేక రైళ్లను ప్రకటిస్తోంది. ఇప్పుడు మరి కొన్ని రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించింది.

1. చర్లపల్లి -- విశాఖపట్నం -- చర్లపల్లి స్పెషల్ ట్రైన్స్:

రైలు నెం. 07067 (చర్లపల్లి నుండి విశాఖపట్నం): ఈ రైలు అక్టోబర్ 15, 2026 న రాత్రి 21:00 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 12:05 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

రైలు నెం. 07068 (విశాఖపట్నం నుండి చర్లపల్లి): ఈ రైలు అక్టోబర్ 16, 2026న మధ్యాహ్నం 15:50 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 05:00 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

ఆపే స్టాప్‌లు: ఈ ప్రత్యేక రైళ్లు రెండు మార్గాలలోనూ నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లె, దువ్వాడ స్టేషన్‌లలో ఆగుతాయి.

బోగీల వివరాలు: ఈ రైళ్లలో 2ూజ, 2ూజ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

2. హెచ్.ఎస్. నాందేడ్ -- పానిపట్ -- హెచ్.ఎస్. నాందేడ్ స్పెషల్ ట్రైన్స్:

రైలు నెం. 07635 (హెచ్.ఎస్. నాందేడ్ నుండి పానిపట్): అక్టోబర్ 21, 27 తేదీలలో ఉదయం 07:40 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 17:30 గంటలకు పానిపట్ చేరుకుంటుంది.

రైలు నెం. 07636 (పానిపట్ నుండి హెచ్.ఎస్. నాందేడ్): అక్టోబర్ 22 మరియు 28 తేదీలలో సాయంత్రం 18:15 గంటలకు బయలుదేరి, రెండో రోజు ఉదయం 06:00 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.

ఆపే స్టాప్‌లు: ఈ రైళ్లు పూర్ణ, పర్భాని, జాల్నా, ఛత్రపతి శంభాజీనగర్, మన్మాడ్, జలగావ్, భుసావల్, ఖాండ్వా, ఇటార్సి, రాణి కమలాపతి, బీనా, వి.ఎల్. ఝాన్సీ, ఆగ్రా కంటోన్మెంట్, మధుర, కోసి కలాన్, న్యూఢిల్లీ మరియు భోధ్వాల్ మజ్రి స్టేషన్‌లలో ఆగుతాయి.

బోగీల వివరాలు: ఈ రైళ్లలో 2ూజ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్ల సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

కేవలం రూ.500తో ఇంటి నుంచే బిజినెస్ స్టార్ట్ చేయండి.. నెలకు వేలల్లో సంపాదించే 8 బెస్ట్ బిజినెస్ ఐడియాస్!

అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు మీ మొబైల్ ఫోన్, ఇంటర్నెట్‌ను ఉపయోగించి ఇంటి నుండే ఈ వ్యాపారాలలో చాలావాటిని ప్రారంభించవచ్చు. కేవలం రూ.500 బడ్జెట్‌తో మీరు ప్రారంభించగల అలాంటి ఎనిమిది వ్యాపార ఆలోచనలను ఇప్పుడు చూద్దాం. అలాగే. కేవలం రూ.500తో ఇంటి నుంచే బిజినెస్ స్టార్ట్ చేయండి.. నెలకు వేలల్లో సంపాదించే 8 బెస్ట్ బిజినెస్ ఐడియాస్! మీరు తక్కువ పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించాలని ఆలోచిస్తుంటే, ఇది మీకు శుభవార్త. ఈ రోజుల్లో కూడా పెద్ద దుకాణం లేదా చెప్పుకోదగ్గ పెట్టుబడి లేకుండా ఇంటి నుంచే ప్రారంభించగల చిన్న వ్యాపారాలు చాలా ఉన్నాయి. సరైన ప్రణాళిక, కఠోర శ్రమ, నిరంతర కృషితో ఈ వ్యాపారాలు క్రమంగా పెద్ద వ్యాపారాలుగా ఎదగగలవు. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు మీ మొబైల్ ఫోన్, ఇంటర్నెట్‌ను ఉపయోగించి ఇంటి నుండే ఈ వ్యాపారాలలో చాలావాటిని ప్రారంభించవచ్చు. కేవలం రూ.500 బడ్జెట్‌తో మీరు ప్రారంభించగల అలాంటి ఎనిమిది వ్యాపార ఆలోచనలను ఇప్పుడు చూద్దాం.

కేవలం రూ. 500తో మీరు ప్రారంభించగల 8 వ్యాపారాలు

మీరు డిజిటల్ విజిటింగ్ కార్డులను తయారు చేసి చిన్న వ్యాపారవేత్తలకు అమ్మవచ్చు. మీరు ఇంట్లోనే దూది వత్తులను తయారు చేసి వాటిని దేవాలయాలకు, దుకాణాలకు సరఫరా చేయవచ్చు. మీరు మఫ్రి, పాపడ్ లేదా నమ్‌కీన్ వంటి ఇంట్లో తయారుచేసిన చిరుతిళ్లను సమీపంలోని దుకాణాలలో లేదా మార్కెట్‌లో వినియోగదారులకు అమ్మవచ్చు. మీరు పాప్‌కార్న్‌ను ఇంట్లో తయారు చేసి, ప్యాకెట్లలో ప్యాక్ చేసి దగ్గరలోని దుకాణాలలో లేదా మార్కెట్‌లోని స్టాల్ ద్వారా అమ్ముకోవచ్చు. మీరు ఆన్‌లైన్‌లో డిజిటల్ ఆహ్వాన పత్రాలను సృష్టించి, విక్రయించవచ్చు. కాన్వా వంటి సాధనాలను ఉపయోగించి మీరు వివాహాలు, పుట్టినరోజులు, ఇతర కార్యక్రమాల కోసం డిజిటల్ పత్రాలను సృష్టించి, విక్రయించవచ్చు. వాట్సాప్ రీసెల్లింగ్ ద్వారా మీరు ఉత్పత్తులను స్టాక్‌లో ఉంచాల్సిన అవసరం లేకుండా వాటిని అమ్మడం ద్వారా కమిషన్ సంపాదించవచ్చు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com